# జేఎన్టీయూలో ఘనంగా ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలు



కూకట్‌పల్లి, జనవరి 31 (ఆంధ్రప్రభ): జేఎన్టీయూ యూనివర్సిటీలో ఎన్ఎస్‌యుఐ జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కెరటం, ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ నాయకులు ఆదర్శ్, నన్నీ ఇమ్మానువల్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కెరటం, తన తుది శ్వాస వరకు తన కలం, గళంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన వ్యక్తి అన్నారు. సమాజంలో అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా ఎలుగెత్తిన గొంతుకగా ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయులు గద్దర్ అని కొనియాడారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడంతో పాటు, వారి పేరుతో అవార్డు నెలకొల్పి ప్రతి ఏటా కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు ప్రధానం చేయాలని నిర్ణయించిన తెలంగాణముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజానీకం, జేఎన్టీయూ విద్యార్థుల పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గద్దర్ పేరు మీద అవార్డులు ప్రధానం చేయడం అనేది పద్మ అవార్డు కంటే గొప్ప, గద్దర్ గారు ప్రజల గుండెలలో నిలిచిపోవడం గొప్ప అనుభూతి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖ, భరత్, ఆకాశ్, సాత్విక్, అశ్వంత్, భాను, తేజ తదితరుల పాల్గొన్నారు.

# పరిశుభ్రత ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పరిశుభ్రత ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుందని జేఎన్‌టీయూహెచ్ ఇన్‌ఛార్జి వీసీ ప్రొ.వి.బాలకిష్టారెడ్డి అన్నారు. శుక్రవారం మూడో విడత సామూహిక, స్వచ్ఛంద పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారపట్టుకొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలున్నా సత్వరమే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వర్సిటీలోని ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలని విద్యార్థినులు వీసీని కోరగా.. తప్పకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.



పరిసరాలు శుభ్రం చేస్తున్న ప్రొ.బాలకిష్టారెడ్డి

## వయోపరిమితి పెంపుపై హర్షం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: వర్సిటీల్లో అధ్యాపకుల పదవీవిరమణ వయోపరిమితిని పెంచడంపై జేఎన్‌టీయూహెచ్ అధికారులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి ప్రతిపాదించడంలో కీలకంగా వ్యవహరించిన ఉన్నత విద్యామండలి ఛైర్మన్, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ బాలకిష్టారెడ్డిని పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ డా.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డా.జీవీ నరసింహారెడ్డి, అన్ని విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పెంపు హర్షణీయం



ఇన్‌చార్జి వీసీ బాలకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

కేపీహెచ్‌బీకాలనీ: రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లోని ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై జేఎన్టీయూహెచ్ ఎంసీటీడబ్ల్యూఎంఏ, ఎస్ఈసీటీఏ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ప్రధాన క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, అధ్యాపకులు సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్, జేఎన్టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, అసోసియేషన్ సభ్యులు మాధవీకుమారి సైదా, రఘురామ్, వసుమతిల, ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ వయస్సు పెంపుపై ఆచార్యుల హర్షం





# వర్సిటీల్లో ఆచార్య పోస్టుల భర్తీకి వడపోత పరీక్ష?

- రెండు విధానాలను సూచించిన నిపుణుల కమిటీ

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల్లో ఆచార్య పోస్టుల భర్తీ కోసం అభ్యర్థులకు వడపోత పరీక్ష (స్క్రీనింగ్ టెస్టు) నిర్వహించనున్నట్లు సమాచారం. బోధనా సిబ్బంది భర్తీకి.. గతంలో మాదిరిగా వర్సిటీలే నియామకాలు చేపట్టేలా పాత విధానాన్ని అమలుచేయడం, దరఖాస్తుదారుల వడపోతకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం అనే రెండు మార్గాలను పరిశీలించాలని నిపుణుల కమిటీ సూచించినట్లు తెలిసింది.

ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టుల భర్తీకి ఎటువంటి విధానం పాటించాలని సూచించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి.. గత డిసెంబరులో అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి ఛైర్మన్‌గా, మహాత్మాగాంధీ వర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్, ఓయూ వీసీ ఎం.కుమార్‌తో కమిటీని నియమించింది. ఆ కమిటీ ఓయూ న్యాయవిద్య విభాగం ఆచార్యుడు జీబీ రెడ్డి, మరొకరి సహకారం కూడా తీసుకుంది. పలు దఫాలు చర్చించిన కమిటీ ఇటీవల నివేదికను ఉన్నత విద్యామండలికి అందజేసింది. ఆచార్యుల భర్తీకి కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును నియమించాలని గత ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి గవర్నరుకు పంపింది. తర్వాత దాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. రెండేళ్ల నుంచి ఆ దస్త్రం పెండింగ్‌లో ఉంది.

## 74 శాతం పోస్టులు ఖాళీ

రాష్ట్రంలోని వర్సిటీల్లో ఇప్పటికే 74 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బోర్డు ఏర్పాటుకోసం ఎదురుచూస్తే ఇప్పట్లో కొత్త నియామకాలు చేపట్టే పరిస్థితి ఉండదు. వర్సిటీల్లో దాదాపు 13 సంవత్సరాలుగా నియామకాలు లేవు. దీంతో గతంలో మాదిరిగానే యూజీసీ మార్గదర్శకాలను అనుసరించి వర్సిటీలే ఖాళీలను భర్తీ చేసుకోవాలని కమిటీ సూచించినట్లు సమాచారం. అయితే, కొన్ని సబ్జెక్టులకు వందలాది మంది దరఖాస్తు చేసుకుంటారు. వారందరినీ ఇంటర్వ్యూ చేయడం వర్సిటీ కమిటీకి భారం అవుతుంది. అందుకే ఒక్కో పోస్టుకు ముగ్గురు లేదా ఐదుగురు ఇంటర్వ్యూకు వచ్చేలా టీజీపీఎస్సీతో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించాలని సూచించినట్లు తెలిసింది. వడపోత పరీక్ష నిర్వహించాలనుకుంటే.. అందులో కటాఫ్ మార్కులను నిర్ణయించడం, షార్ట్ లిస్ట్ తయారు, తర్వాత చేపట్టే ప్రక్రియ తదితరాలను పరిశీలించేందుకు అధ్యయన కమిటీని నియమించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. కమిటీ మాత్రం వడపోత పరీక్షకే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

# బిక్స్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ హెచ్ బ్యూరో ఆఫ్ ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీసెస్(బిక్స్) డైరెక్టర్, చీఫ్ ఇంజినీర్‌గా డాక్టర్ ఎస్.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ విభాగం డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరెడ్డి స్థానంలో ఇన్‌ఛార్జి వీసీ బాలకిష్టారెడ్డి ఆదేశాల మేరకు శ్రీనివాసులును నియమిస్తూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. మెస్ టెండర్ల వివాదం, సమస్యల పరిష్కారంలో జాప్యం, ఫిర్యాదుల నేపథ్యంలో ఈ మార్పు జరిగినట్లు వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి.